
# మంచోడు

**- ప్రఫుల్లచంద్ర**

ఉగాది పోటీలో ఎంపికైన కథ



అబ్బాయి చాలా మంచోడు. మంచి ఉద్యోగం. మంచి కుటుంబం. వెయ్యేళ్లు తపస్సుచేసినా ఇంతకంటే మంచి సంబంధం మీకు దొరకదని పెళ్లిళ్ల పేరయ్యతోబాటు బంధువులు కూడా చెప్పడంతో జయతిని ఆదిత్యకిచ్చి పెళ్లిచేశారు ఆమె తల్లిదండ్రులు. పెళ్లిలో వచ్చిన సమస్యల్ని మంచివాళ్లు కాబట్టి వాళ్లు సర్దుకుపోయారు. అమ్మాయికి మంచి సంబంధం చేసినందుకు పొంగిపోయారు వీళ్లు.

శోభన రాత్రి ఆదిత్య భార్యకు తన ఆదర్శాలు వివరించి ఆమెనుంచి తను ఆశిస్తున్నదేమిటో చెప్పగా "అబ్బో, నా మొగుడు బంగారం!"అని మురిసిపోయింది జయతి. కానీ-

మంచితనాన్ని భరించడమెంత కష్టమో క్రమంగా అర్థం అవుతోందామెకు.

సినిమా, షికారు, గుడి- ఎక్కడికెళ్లాలన్నా అతడు అమ్మ పర్మిషన్ అడుగుతాడు. ఆమె ఏవో కుంటిసాకులు చెబుతుంది. అంతే. ప్రోగ్రాం కాన్సిల్! జీతం అంతా అమ్మకే యిస్తాడు. భార్యకు మల్లెపూలు కొనాలన్నా అమ్మనే డబ్బు అడగాలి. ఎందుకురా, డబ్బు దండుగ అనేస్తుందామె! ఏ కూర వండాలో, ఏ టిఫిన్ చెయ్యాలో అత్తగారిదే నిర్ణయం. చివరకు కూరగాయలు ఏ సైజులో తరగాలో ఆమే చెబుతుంది. బిచ్చం వెయ్యడానిక్కూడా కోడలికి అధికారం లేదు.

జయతి అందాన్ని, అణకువను ఎవరైనా మెచ్చుకుంటే చాలు, అత్తగారికి చిర్రెత్తి ఎందుకో ఒకందుకు కోడల్ని తిట్టిపోస్తుంది. కోడలు ఎవరితో మాట్లాడుతూ వున్నా డిటెక్టివ్ లాగ ఒక కన్నేసి ఆమె చుట్టూ తచ్చాడుతూనే ఉంటుంది అత్తగారు.

ఇంక భరించలేక బెడ్ రూంలో భర్తకి చెప్పుకుంటే ఆయనగారు-

"ఈ పెద్దలు అంతే జయతీ! కోడల్ని అదుపులో పెట్టకపోతే కొడుకుని కొంగులో కట్టుకొని తమకి దక్కకుండా చేస్తుందని వారి భయం. నువ్వేమీ పట్టించుకోకు"అని నవ్వేస్తాడు తేలికగా.

భార్యని ఆదుకోలేని మంచితనం అదేం మంచితనం! అని కోపం వచ్చేస్తుంది జయతికి.

★ ★ ★

వివాహం అయాక మొదటి పండుగకు భర్తతో పుట్టింటికి వెళ్లగానే స్వర్గంలో అడుగుపెట్టినట్లు అనిపించింది జయతికి.

ఆదిత్య కూడా కలివిడిగా ఉంటూ, హుషారుగా జోక్‌లేస్తూ, నవ్వుతూ నవ్విస్తూ "ఎంత మంచివాడో!" అనిపించుకున్నాడు అందరిచేతా.

పండుగ నాలుగురోజులూ యిట్టే గడిచిపోగా ఆ స్వర్గాన్ని వీడి మళ్లీ నరకానికి వెళ్లాలనిపించలేదు జయతికి. రావాలనిపించినప్పుడే రమ్మని పర్మిషన్ యిచ్చి వెళ్లిపోయాడు ఆదిత్య. కానీ-

అతడు వెళ్లిన మర్నాడే అత్తగారినుంచి జయతికి ఫోన్- వెంటనే బయలుదేరి వచ్చేయమని.

భగ్గుమంది జయతి. ఆవేశంతో ఊగిపోతూ అత్తగారిని తిట్టిపోసి తన కష్టాలు అమ్మకు చెప్పుకొని ఏడ్చేసింది. మంచి కుటుంబంలో మంచి మొగుడితో జయతి హాయిగా ఉందనుకొని నిశ్చింతగా వున్న కుటుంబ సభ్యులంతా నిశ్చేష్టులయారు. అత్తగారి మాట పాటించి యిప్పుడు జయతి వెళ్లాలా, వద్దా అనేది చర్చనీయాంశం అయింది.

వెళ్లడమే మంచిదని జగదాంబ అభిప్రాయం.

"నీ మొగుడు నీకు పర్మిషన్ ఇచ్చాడు కదా. వారం రోజులు పోయాక వెళ్లు. అత్తగారి పెత్తనానికి అడ్డుకట్ట వేయకపోతే అలుసైపోతావ్. నీ జీవితం నాశనం అయిపోతుంది. జాగ్రత్త!" చెల్లి తరఫున వకాల్తా పుచ్చుకున్నాడు-

ఈమధ్యనే బోర్డు పెట్టి రెండు కేసులు గెల్చిన హుషారులో వున్న కుర్ర లాయర్ ప్రదీప్.

★ ★ ★

వారం రోజులు గడిచాక జయతి అత్తవారింట అడుగు పెట్టగానే ప్రళయమే సంభవించింది. అత్తగారు కాళిక అవతారం ఎత్తగా మామగారు రుద్రతాండవం చేశాడు. జయతి హడలిపోయి భర్త ఆఫీసునుంచి వచ్చేవరకూ ప్రాణాలు అరచేత పెట్టుకుంది.

ఆదిత్య రాగానే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సుశిక్షిత నటుల్లాగ అత్తమామలు ఏమీ జరగనట్టే హుషారుగా కొడుకుతో కబుర్లు చెప్పి "ఇన్నాళ్లకు నీ భార్యకు నువ్వు జ్ఞాపకం వచ్చావురా"అని జోక్ చేశారు.

రాత్రి బెడ్‌రూంలో అంతా చెప్పుకొని ఏడ్చింది జయతి. అంతా విని నవ్వేశాడు ఆదిత్య. "ఏ తల్లీ తన సంతానాన్ని ప్రేమించినట్లు కోడల్ని ప్రేమించలేదు జయతీ- చివరకు మీ అమ్మ కూడా! కొడుకు చెయ్యి జారిపోయి తన అధికారం అంతరిస్తుందని భయం. అలాంటిదేమీ లేదని మనమే మన ప్రవర్తన ద్వారా సహనంతో నమ్మకం కలిగించాలి. తర్వాత అంతా చక్కబడుతుంది."

ఆ మహామంచి మనిషి మీద మా చెడ్డ కోపం వచ్చేసింది జయతికి.

★ ★ ★

చేతిలో సూట్‌కేసుతో గుమ్మంలో ప్రత్యక్షమైన జయతిని చూసి నిర్ఘాంతపోయారు ఇంటిల్లిపాది.

"ఆ నరకంలో ఆ రాక్షసితో వేగలేనే అమ్మా! నేనిక్కడే ఉండిపోతా" భోరున ఏడుస్తూ లోనికొచ్చి "ఆయన మంచివాడో, చేతగాని పిరికివాడో అర్థంకావడం లేదే. నేనెంత మొత్తుకున్నా సహనం, సహనం అంటారు గాని తల్లిని మందలించరు అంటూ ఆ తల్లి రాక్షసి పెడుతున్న ఆరళ్లు ఏకరువు పెట్టింది. అన్న ప్రదీప్‌కి ఆవేశం తన్నుకొచ్చింది.

"సహనం, సహనం అని కూర్చుంటే ఆ రాక్షసి చచ్చేవరకూ నీకు సుఖశాంతులుండవే. ఈమధ్యనే గృహహింస నిరోధక చట్టం వచ్చింది. ఒక్క కేసు తగిలిస్తే చాలు అందరి రోగాలూ ఠక్కున కుదురుతాయి. నీ మొగుడుకేమీ అవకుండా అత్తమామలకే తగిలేట్టు నేను కేసు వాదిస్తానుగా" ధీమాగా అన్నాడు.

కుటుంబ కలహాలు కోర్టుకీడ్చవద్దనీ, కష్టాలు కలకాలం ఉండవనీ జగదాంబ నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోలేదు. తన అభిప్రాయం ఎవరూ అడగనందున మెదలకుండా ఊరుకుంది ప్రదీప్ భార్య వివేక.

★ ★ ★

"ఇదంతా నీవల్లనే! నీ చేతగానితనం వల్లనే! ఆయనకేమీ హాని జరగదని నమ్మబలికి కోర్టుకీడ్చావ్! ఇప్పుడేమయింది? ఏమయింది?" అన్నమీద విరుచుకుపడి,

మోదుకుంటూ రోదించింది జయతి.

ఆమెను ఓదార్చే ధైర్యం లేక నిశ్చేష్టంగా ఉండిపోయారందరూ.

తన తల్లిదండ్రుల తప్పేమీ లేదనీ, వారలా ప్రవర్తించడానికి తనే కారణం అనీ కోర్టులో అబద్ధం చెప్పి నేరం తన మీద వేసుకున్నాడట ఆ మంచోడు. అతనికొక సంవత్సరం కారాగారం, వెయ్యి రూపాయిలు జరిమానా విధించింది కోర్టు.

* * *

నెల గడిచినా జయతి కోలుకోలేదు. ఆమె హృదయ వేదన కళ్లలో కనిపిస్తోంది. మాటలు తగ్గించింది. భోజనం మరిచిపోయింది. ఏదో వెదుక్కుంటున్నట్లు హృదయ విదారకంగా కనిపిస్తోంది.

ఓరోజు సోఫాలో చెల్లి ప్రక్కన కూర్చుని ఓదార్చుతూ భవిష్యత్తు గురించి ఏం ఆలోచిస్తున్నావని అడిగాడు ప్రదీప్. కుటుంబ సభ్యులంతా చుట్టూ మూగి ఆమె జవాబుకోసం ఎదురు చూస్తున్నారు. ఆమె మాట్లాడలేదు.

"కోర్టులో అబద్ధం చెప్పి అతడు తల్లిదండ్రుల్ని రక్షించుకుంటాడని ఊహించలేకపోయానమ్మా! శిక్ష పూర్తయాక నువ్వు కాపురానికెళ్లినా తల్లిదండ్రులు కోరితే నిన్ను చంపెయ్యడానికైనా సిద్ధపడతాడు. అందుకని నిన్న జైలుకెళ్లి- విడాకుల కాగితాలు పంపుతాను. సంతకం పెట్టమని అతడ్ని అడిగాను. మంచోడు కదా! సరే అన్నాడు. నువ్వు కూడా ఈ కాగితాల మీద సంతకం పెడితే..." ఫైలులోంచి కాగితాలు తీసి ఆమెకిచ్చాడు ప్రదీప్.

అన్న వైపు, తర్వాత అమ్మ వైపు, ఆ తర్వాత వదిన వైపు చూసింది జయతి, "నీ అభిప్రాయం చెప్పు వదినా!" దీనంగా అడిగింది.

ఆ అవకాశంకోసమే ఎదురుచూస్తున్న దానిలా విప్పారిన ముఖంతో వచ్చి ప్రక్కనే కూర్చుని స్నేహంగా ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి "ఆ కాగితాలు చింపి పారెయ్ జయతీ! పెళ్లైన కొత్తలో నాకు మీరు పెట్టిన ఆరళ్లకన్నా గొప్పవి కావు నీ కష్టాలు! ఆ రోజుల్లో నేను అనుభవించిన హింసను మీరు మరచిపోయినా, నేను మరచిపోలేదు. ఎన్ని రాత్రులు ఏడుస్తూ పడుకున్నానో మీ అన్నయ్యకు తెలుసు. ఆయనిప్పుడు పెద్ద కబుర్లు చెబుతున్నారు గాని ఆ రోజుల్లో అమ్మనూ, నిన్నూ మందలించలేక నాకు నైతిక మద్దతు కూడా యివ్వలేదు. పండక్కి పుట్టింటికి వెళ్లినప్పుడు నేను కూడా నీలాగే ఇంక అత్తవారింటికెళ్లనని ఏడ్చేశాను. ఆ రోజుల్లో గృహహింస నిరోధక చట్టం ఉండి ఉంటే నేను కూడా నీలాగే కోర్టుకెక్కితే మీరెక్కడ ఉండేవారు? మీ ముఖాలెక్కడ పెట్టుకునేవారు? చేతిలో బ్రహ్మాస్త్రం ఉంది కదాని అయిన దానికీ, కాని దానికీ ప్రయోగిస్తే కాపురాలు కూల్చుకోవటం తప్ప సాధించేది ఏమీ ఉండదు" ఖంగుమంది వివేక స్వరం.

తేలుకుట్టిన దొంగల్లాగ కుంచించుకుపోయారు జగదంబ, ప్రదీప్‌లు. కొత్తగా, వింతగా వదిననే చూస్తూ ఉండిపోయింది జయతి.

"సహనంతో ఒక్క ఏడాది వేచి చూడు. అప్పటికీ నీ అభిప్రాయం మారకపోతే అప్పుడాలోచిద్దాం. స్వతహాగా ఎవరూ దుర్మార్గులు కారు. కొత్త కుటుంబంనుంచి కొత్త భావాలతో, కొత్త అలవాట్లతో వచ్చే కోడలు తన అధికారానికి ఎసరు పెడుతుందేమోనన్న భయంతోనే అత్తలు అలా ప్రవర్తిస్తారు, సహనంగా ఒదిగి ఉంటే పరిస్థితులు అవే చక్కబడతాయి అని మా అమ్మ చెప్పిన సూత్రాన్నే నేను పాటిస్తున్నాను. మీరిప్పటికీ నన్ను పరాయి వ్యక్తిగానే చూస్తున్నా, ఏ కూర వండాలో ఏ టిఫిన్ చేయాలో యిప్పటికీ మీ అమ్మగారే నిర్ణయిస్తున్నా, అందరికీ వండి వడ్డించే యంత్రంగానే మీరు నన్ను చూస్తున్నా మీలో కొంచెం మార్పు వచ్చింది. నేనీ యింట్లో అడుగుపెట్టిన రెండేళ్లకు ఇదిగో యిప్పుడే మొదటిసారి నువ్వు నా సలహా అడిగావు! అంటే నీకు తెలియకుండానే నువ్వు నన్నీ కుటుంబంలోని వ్యక్తిగా పరిగణించావన్నమాట! నాలాగ నువ్వు కూడా అత్తవారింట సహనంగా వేచి ఉండాల్సింది. అనవసరంగా కోర్టుకెక్కావు."

ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని ఆమె నోట వెలువడుతున్న మాటలు శరాఘాతాల్లాగ వారి హృదయాల్ని తాకాయి. ఆ మాటల్లోని సత్యశక్తి వారిని నిరుత్తరుల్ని



ఆ కాగితాలు చింపి పారెయ్ జయతీ! పెళ్లైన కొత్తలో నాకు మీరు పెట్టిన ఆరళ్ళ కన్నా గొప్పవి కావు నీ కష్టాలు! ఆ రోజుల్లో నేను అనుభవించిన హింసను మీరు మరచిపోయినా, నేను మరచిపోలేదు. ఎన్ని రాత్రులు ఏడుస్తూ పడుకున్నానో మీ అన్నయ్యకు తెలుసు. ఆయనిప్పుడు పెద్ద కబుర్లు చెబుతున్నారు గాని ఆ రోజుల్లో అమ్మనూ, నిన్నూ మందలించలేక నాకు నైతిక మద్దతు కూడా యివ్వలేదు. పండక్కి పుట్టింటికి వెళ్లినప్పుడు నేను కూడా నీలాగే ఇంక అత్తవారింటికెళ్లనని ఏడ్చేశాను.

చేసింది. అందరి తలలూ వాలిపోయాయి. "నన్నిప్పుడేం చేయమంటావ్ వదినా?" మరింత బేలగా అడిగింది జయతి.

"జైలుకెళ్లి నీ భర్తని కలిసి మాట్లాడు" ఠక్కున చెప్పింది వివేక.

షాక్ అయింది జయతి. నిజానికి ఆమెకూ వెళ్లాలనే ఉంది కాని భయం వెనక్కి లాగుతోంది. నిస్సహాయంగా అమ్మవైపు చూసింది.

తన అభిప్రాయానికి విలువ యివ్వకుండా కూతురు కోర్టుకెక్కి సమస్యను కొని తెచ్చుకున్నందుకు జగదాంబక్కూడా మనస్తాపంగానే ఉంది. అయితే ఇప్పుడు కోడలు అంత బలంగా, స్పష్టంగా మాట్లాడి కూతురులో వివేకం రగిల్చినందుకు కోడలి మీద అభిమానం కలిగింది. ఆమె పట్ల తన వైఖరికి పశ్చాత్తాపమూ కలిగింది.

* * *

విజిటర్స్ గదిలో తనకోసం నిరీక్షిస్తున్న వివేకను చూసి ఆశ్చర్యపోయిన ఆదిత్య భార్యకోసం చుట్టూ చూశాడు. ఆ గది నిండా ఖైదీలను చూడ వచ్చిన జనంతో కోలాహలంగా ఉంది. మాటలు సరిగా వినిపించడం లేదు.

ఇద్దరూ కాస్త నడిచి జనం లేని చోట కూర్చున్నారు.

"అన్నయ్యా, బాగున్నారా?" ఆప్యాయంగా అడిగింది వివేక.

బయటకు వెళ్లే స్వేచ్ఛ లేకున్నా ఆదిత్యకు జైలు జీవితం బాగానే ఉంది. అతని మంచితనం గుర్తించిన జైలర్ తన పిల్లలకు ట్యూషన్ చెప్పమని అడిగాడు. పగలంతా ఆదిత్య జైలు కాంపౌండ్‌లోనే ఉన్న జైలర్‌గారింటిలోనే ఉంటాడు. సాయంకాలం తోటి ఖైదీల చేత భక్తిగీతాలు పాడిస్తాడు. ఏ కష్టమూ లేదు. ఈ విషయాలన్నీ చెప్పి-

"విడాకుల కాగితాలు తెచ్చావా వివేకా?" హఠాత్తుగా అడిగాడు ఆదిత్య.

"విడాకులా?! అలాంటిదేమీ లేదు అన్నయ్యా! తనని మీరు క్షమించి స్వీకరిస్తారో, లేదో అని తల్లడిల్లిపోతోందా పిచ్చిపిల్ల!"

"తనేం తప్పుచేసిందని క్షమించడం! నాకామెమీద కోపం లేదమ్మా! కొత్త కోడల్ని అదుపులో పెట్టాలని అత్తమామలు ప్రయత్నించడం సహజమే. వారి పెత్తనాన్ని కొత్త కోడలు ప్రతిఘటించడమూ సహజమే..." అతని మాట పూర్తికాకుండానే-

"తల్లిదండ్రుల నేరాన్ని కొడుకు తన మీద వేసుకోవడమూ సహజమే!" నవ్వింది వివేక. అంత గంభీర వాతావరణంలోనూ- ఆదిత్య ముఖంలోనూ, అతనికి కనిపించకుండా కాస్త దూరంలో నిలుచున్న జయతి ముఖంలోనూ చిరు హాసం విచ్చుకుంది.

"జయతి మీద మీకు కోపం లేకపోయినా మీ తల్లిదండ్రులకుండడం సహజమే కదా! మీ శిక్ష పూర్తయ్యాక కాపురానికొస్తే వారు తనని మరింత హింసిస్తారని జయతి భయపడడం సహజమే కదా!" కొనసాగించింది వివేక. ఒక క్షణం గంభీరంగా ఉండిపోయాడు ఆదిత్య.

"స్వతహాగా ప్రతి మనిషీ మంచివాడే వివేకా! పరిస్థితులు, అపోహలూ ఆ మంచితనాన్ని కప్పేస్తూ ఉంటాయి. ప్రతి ఒక్కరూ తనలోని మంచిని పెంచుకుంటూ ఎదుటివారి మంచిని గుర్తించి, గౌరవించగలిగితే సమస్యలే ఉండవు. జయతిలోని మంచితనాన్ని ఆమె అవగాహనా రాహిత్యం కప్పేసింది. దాన్ని తొలగిస్తే ఆమెకన్నా మంచి కోడలు నీకు దొరకదని అమ్మతో ఎన్నోసార్లు చెప్పాను. ఇప్పుడు జయతి లాగానే అమ్మ కూడా పశ్చాత్తాప పడుతోందని నా నమ్మకం."

భర్త ఎదుటకు రాలేక ప్రక్కనే నక్కిన జయతి అంతర్నేత్రాన్ని ఆ మాటలు తెరిచాయి. అతడు మంచితనం అనే ముసుగులో చలామణి అవుతున్న పిరికివాడు, చేతగానివాడు అని ఆమె ఇంతవరకూ భ్రమ పడింది. అంతర్నేత్రం తెరుచుకోగానే కన్నీళ్లు వరదలై ప్రవహించాయి.

"ఇప్పుడొకటే సమస్య వివేకా! జైలు శిక్షవల్ల నా ఉద్యోగం పోతుంది. కొత్త ఉద్యోగం దొరకదు. రోడ్డు ప్రక్క బజ్జీలమ్ముకొని కుటుంబాన్ని పోషించుకోగలను. జయతి కాపురానికొస్తే ఆమెకు తిండి పెట్టగలను కానీ కనీస సౌకర్యాలు కూడా సమకూర్చలేనేమో" దిగులుగా అన్నాడు.

"మరేం ఫర్వాలేదు. నేనూ మీ ప్రక్కనే నిలబడి బజ్జీలు, పకోడీలు, మసాలా వడలూ చేస్తూ ఉంటాను. మీరు సేల్స్ చూసుకోండి. క్రమంగా ఫైవ్‌స్టార్ హోటల్ స్థాయికి ఎదుగుదాం" చాటునుంచి బయటకొచ్చి భర్త ఎదుట నిలచింది జయతి. సంభ్రమంగా చూశాడు ఆదిత్య.

ఆమె పెదవుల మీద దరహాసం. కళ్లలో కన్నీరు. అతనికీ అంతే.

"రోజంతా మీ ప్రక్కనే ఉంటే అత్తపోరు తప్పిపోతుంది కదాని మీ ఆవిడ ఎత్తుగడ, అన్నయ్యా!" జోక్ చేసింది వివేక.

అందరూ కిలకిలా నవ్వుకున్నారు.

★